క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాలు 9వ తేదీ సోమవారం నుంచి 12వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు పూనూరు గ్రూపు కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ సాయత్రం 6 గంటలకు విశ్వక్షేణపూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం, 10 వ తేదీ నిత్యహోమాలు, వేణుగోపాలస్వామి వారి కల్యాణం,11వ తేదీ బుధవారం రూ.80 లక్షలతో నిర్మించిన వేణుగోపాలస్వామి నూతన రథశాల ప్రారంభోత్సవం, ఉదయం 11 గంటలకు పూనూరు ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, సాయత్రం 3 గంటలకు ఏరువాక అరకల ఉత్సవం, 6 గంటలకు వేణుగోపాలస్వామి దివ్యరథోత్సవం, 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 12వ తేదదీ గురువారం వసంతసేవ, చక్రస్నానం, ధ్వజావరోహణం, తీర్థప్రసాద వినియోగంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని ఈఓ తెలిపారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత

అద్దంకి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి మముఖ మంటప నిర్మాణం జరుగుతోంది. దానికి దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం పట్టణానికి చెందిన చల్లగుంట మాధవరావు కుమార్తె పావని రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. అదే విధంగా మాధవరావు ధర్మపత్ని అన్నపూర్ణ రాతి ముఖ మంటప నిర్మానానికి రూ.1,00,116 బహూకరించారు.

నేడు డిగ్రీ మూల్యాంకనం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఆంధ్రకేసరి యూనివర్శిటీ, ఒంగోలు 2024–25 విద్యాసంవత్సరానికి చెందిన నాలుగో సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం సోమవారం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్.మురళి ఆదివారం తెలిపారు. మూల్యాంకనానికి హాజరయ్యే అధ్యాపకులు తమ రిలీవింగ్ సర్టిఫికెట్‌తో పాటు ఒక పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రొఫైల్ సర్టిఫికెట్‌లు తీసుకుని సోమవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో రిపోర్టు చేయాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


శిక్షకులను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల: మండలంలోని దేవాంగపురిలోని బీవీ అండ్‌బీఎస్ హైస్కూల్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 రోజులు పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సూర్యచంద్ర, అంజనేయులు, శివ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, కోటయ్యబాబు, బట్ట వెంకట్రావు, జిలానీ మాట్లాడుతూ 45 రోజులు పాటు శిక్షణ కార్యక్రమంలో కరాటే, కర్రసాము, యోగ, బాక్సింగ్‌లో తర్ఫీదు ఇచ్చామన్నారు. 7 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల 275 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మాజీ కరస్పాండెంట్ బీరక కాశీనాథ్, పన్నెం మల్లిఖార్జునబాబు, ప్రధానోపాధ్యాయురాలు టి.రమాదేవిలు బహుమతులు అందించారు. అలానే శిక్షకులు అమీన్‌రెడ్డి, యుగంధర్, మల్లిఖార్జున్, తేజ, యశ్వంత్, చైతన్య, యామిని, తోట కోటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. చిన్నారులు ప్రదర్శించిన కర్రసాము, నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రజా సేవకులకు అవమానం

- కూటమి పాలనలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు అందని గౌరవ వేతనం
- గత ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా చెల్లింపులు
- జిల్లాలో 300 మంది ఎంపీటీసీలు, 25 మంది జెడ్పీటీసీలు



బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం

అద్దంకి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారం ఓ కలలా మారింది. నేటి పాలనలో ప్రజా ప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం అందజేయడం లేదు. మరో పక్క హామీల గురించీ పట్టించుకొనేవారు కానరావడం లేదు. వీరంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడమే కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబరు 2021లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. నూతనంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రజా ప్రతినిధులు ఎన్నికయ్యారు. బాపట్ల జిల్లాలో పావు వంతు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మినహా మిగిలిన వారంతా వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన వారే. జిల్లాలో మొత్తం 300 మంది ఎంపీటీసీలు, 25 మంది జెడ్పీటీసీలు సభ్యులుండగా మెజారిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ సభ్యులు కావడంతోనే గౌరవ వేతనాన్ని పెండింగ్‌లో పెట్టిందని, ఇదంతా కక్ష్య సాధింపు చర్యల్లో భాగమనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓ కలగా..

ఎంపీటీసీలకు గౌరవ వేతనంగా రూ.3 వేలు, ఎంపీపీలకు గౌరవ వేతనంగా రూ.6 వేలు, జెడ్పీటీసీ సభ్యులకు రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. వీరందరికీ నెలా నెలా వేతనాలు ఇవ్వకపోయినా, గత ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా గౌవర వేతనం చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వేతనాలు పెండింగ్‌లో పడగా, ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ వారి వేతనాల గురించి ఇప్పటికీ పట్టించుకోలేదు. వారికి వేతనాలు ఇవ్వాలన్న సంగతే మరచింది.

ప్రొటోకాల్ లేదా..

గౌరవ వేతనం ఇవ్వకున్నా, గౌరవమైనా దక్కుతుందా అంటే అదీ లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కార్యక్రమాల్లో ప్రొటోకాల్ గౌరవ తమకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నాయకులు తమకు దక్కాల్సిన గౌరవాన్ని కాలరాస్తున్నారని, తమకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెబుతున్నారు. సమావేశాలు సైతం తూతూమంత్రంగా ముగుస్తున్నాయని, సమస్యల గురించి పట్టించుకునేవారు, వినే నాయకులే కరువాయ్యారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గౌరవ వేంతన విడుదలతోపాటు, ప్రొటోకాల్ అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

వెంటనే గౌరవ వేతనం ఇవ్వాలి



ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి గౌవర వేతనం ఇవ్వడం లేదు. ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వకపోతే ఎలా? మండల సమావేశాలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. వెంటనే గౌరవ వేతనాలు ఇవ్వాలి. అదే విధంగా ప్రజా ప్రతినిధులుగా ప్రొటోకాల్ అమలయ్యేలా చూడాలి.

– మూడావత్ అంజమ్మ భాయ్, వెలమవారిపాలెం ఎంపీటీసీ

రెండు సంవత్సరాలుగా..



నిలిచిపోయిన గౌవర వేతనాలు వెంటనే ఇవ్వాలి. గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లుగా ఇచ్చారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన తరువాత ఇంత వరకు వేతనం గురించి పట్టించుకోలేదు.

– డేనియేల్, ఎంపీటీసీ

పని గంటలు తగ్గించకపోతే ఆందోళన



పర్చూరు బొమ్మల సెంటర్‌లో నిరసన ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

పర్చూరు(చినగంజాం): పని గంటలు తగ్గించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 8 గంటల పని వ్యవధిని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె. శ్రీనివాసరావు, పర్చూరు మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి బండారు చినదాసు, మత్తే డేవిడ్, రిక్షా కార్మికులు నాయకుడు పోతురాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గా బదిలీలు చేపట్టండి


కారంచేడు నుంచి నిరసన కార్యక్రమానికి బయలుదేరిన నాయకులు

కారంచేడు: ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో బదిలీలు చేపడతామని నమ్మబలికి ఇప్పుడు మాట మార్చి వెబ్ ఆప్షన్‌ల ద్వారా బదిలీలు చేపడతామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైంది. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు డీఈఓ కార్యాలయం వద్ద కారంచేడు మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఆదివారం ధర్నాలో పాల్గొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా మాన్యువల్‌గానే బదిలీలు చేపట్టి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, రావి పద్మావతి, నాగమణి, మార్తమ్మ, పావులూరి శ్రీనివాసరావు, రమేష్‌రెడ్డి, పద్మనాగులు, సువర్ణబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం తగదు

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

చీరాల రూరల్: తెనాలిలో దళిత యువకులపై పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమని, అమానుష దారుణకాండ తీరును ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ అన్నారు. ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ చీరాలని యోజకవర్గం ఆధ్వర్యంలో తెనాలిలో దళిత యువకులపై పోలీసు చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, వేధింపులు అధికమయ్యాయని పేర్కొన్నారు. తెనాలిలో దళిత యువకులపై ఇద్దరు సీఐలు విచక్షణ మరచి నడిరోడ్డుపై లాఠీ కర్రలతో చితకబాదటం ఏ మాత్రం క్షమార్హం కాదన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ మాట్లాడుతూ తప్పుచేసిన వారిని కోర్టుల ద్వారా శిక్షించాలి కానీ నడిరోడ్డుపై కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. తప్పులు చేసిన ఎవరికైనా సమానంగా శిక్షలు ఉండాలన్నారు. అగ్రకులాల్లో కూడా అనేక కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారని వారిని ఎక్కడా ఈ విధంగా కొట్టిన దాఖలాలు లేవన్నారు. దళితులను పోలీసులు ఎందుకంత చులకనగా చూస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. దళిత యువకులపై దారుణానికి పాల్పడిన సీఐలు, ఇతర పోలీసులను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. డొక్కా జగన్‌మోహన్ రావు, కాటి మార్క్, దానియేలు, పుల్లయ్య, అర్జునరావు, సుధాకర్, పృథ్వీ, ఆదాము, ఎలీషా, శ్రీను, చిరంజీవి, నాగయ్య పాల్గొన్నారు.

చదువుల తల్లికి సత్కారం

చీరాల రూరల్: వాడరేవు జిల్లాపరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతూ అత్యధికంగా 573 మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థిని గరికిన వెంకట లక్ష్మిని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఘనంగా సత్కరించారు. వాకర్స్ సభ్యుడు దోగుపర్తి వెంకట సురేష్ ప్రోత్సాహంగా రూ. 1,200 నగదు బహుమతి అందించి జ్ఞాపికతో పాటు ప్రశంస పత్రం నోటు పుస్తకాలు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. మత్స్యకార నిరుపేద కుటుంబంలో జన్మించిన వెంకట లక్ష్మి చదువులో ముందుంటూ మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందటం మంచి పరిణామమని కొనియాడారు. చారుగుళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, దండా నారాయణరావు, నిత్యానందలాల్, పూర్ణా, సత్యం, మద్దు సత్యనారాయణ, కాటమరాజు, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగానే ప్రజా సమస్యల పరిష్కార వేదిక


మార్టూరు: మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లాల్సిన అవసరం లేదని.. స్థానికంగానే పరిష్కరిస్తామని తహసీల్దార్ టి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనాల్సిందిగా కోరారు.

పర్చూరు(చినగంజాం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి సోమవారం పర్చూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలను సమర్పించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లుతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి హాజరు కావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు.

ఈర్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో ఈర్ల గంగమ్మ

బల్లికురవ: మృగశిర కార్తె ప్రారంభం త్రయోదశి ఆదివారం సందర్భంగా బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మకు సన్నిధానానికి వివిధ గ్రామాల భక్తులు రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల పాలిట కొంగు భాగంగా విరాజిల్లుతున్న ఈర్ల గంగమ్మ సన్నిధానానికి బపాట్ల పల్లనడు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పొగళ్లపెట్టి తమ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవాలని, పాడి పంట వృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ అర్చకుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల తరువాత అమ్మవారిని అలంకరించారు.

మమ్మేలు మాయమ్మ.. గంగమ్మా!


ప్రత్యేక దర్శనంలో గంగమ్మ తల్లి


మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

కారంచేడు: ఆపదలను తీర్చే కల్పవల్లిగా, గ్రామ దేవతగాను విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చే క్రమంలో అమ్మవారికి ఇష్టమైన పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. వ్యవసాయ పనులు ప్రారంభించే రైతన్నలు, వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు, అమ్మవారి ఆశీస్సులతో ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు తమ మొక్కుబడులు తీర్చుకొనేందుకు ఆలయంలో బారులు తీరారు.

అ‘పూర్వ’ కలయిక


సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల

చీరాల: దేవాంగపురిలోని బీవీఎస్‌బీఎస్ హైస్కూల్‌లో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆదివారం పాఠశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ జీవితాల్లో జరిగిన ఒడిదుడుకులను చెప్పుకుంటూ ఒకరి అనుభవాలను మరొకరు తెలుసుకున్నారు. 130 మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట కలవడం వారికి ఎంతో సంతోషాన్ని అందించింది. ఈ సందర్భంగా పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పించిన 35 మంది ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బొడ్డు సుబ్రహ్మణ్యం, గుంటూరు బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుత్తి హేరంభరావు, కేఎస్ఎస్ ప్రసాద్, బొడ్డు బాలచంద్రరావు, పన్నెం కోటయ్యబాబు తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా మహా కుంభాభిషేకం


పాండురంగ విఠల్ స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లో వేంచేసియున్న శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ విఠల్ స్వామి వారి దేవాలయంలో ఆదివారం మహాకుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. నిత్యార్చన, అష్టాక్షరి మహామంత్ర సుదర్శన హోమం, హనుమత్ హోమం నిర్వహించారు. దేవాలయ జీర్ణోద్ధరణ దాతలు రావుబహుదూర్ రావుల సుబ్బారావు, రావుల హరిప్రసాదరావు, బందా వేంకట నర్సు పంతులు వంశీయులు, మహాకుంభాభిషేక ప్రధాన దాత రావుల సాయి కుమారిలచే నిర్వహించారు.

ఘనంగా గంధ మహోత్సవం


గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఇంకొల్లు(చినగంజాం): మండల కేంద్రమైన ఇంకొల్లులో గంధమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు మధ్య ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు తమ మొక్కులను చెల్లించుకున్నారు. జెండా చెట్టు వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులకు గంధం అందజేశారు.

17న పోలేరమ్మ తిరునాళ్లు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం రైల్వే స్టేషన్ వద్ద వేంచేసియున్న ఈపురుపాలెం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 17తేదీ మంగళవారం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, ప్రత్యేక పూజలు, మ్యూజికల్ నైట్‌తో తిరునాళ్లను నిర్వహిస్తున్నామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గ్రంథాలయానికి తాళం

- 14 నెలలుగా తలుపులు తెరుచుకోని వైనం


తలుపులు తెరుచుకోని గ్రంథాలయం

బల్లికురవ: విద్యార్థులు, మహిళలు యువకులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శాఖా గ్రంథాలయం 14 నెలలుగా తలుపులు తెరుచుకోవడం లేదు. ఇన్‌చార్జికి అదనపు బాధ్యతలు అప్పగించినా ఆయన తన పరిధిలోని గ్రంథాలయానికే పరిమితమయ్యారు. బల్లికురవలో 1985లో ఉమ్మడి ప్రకాశం జిల్లా కింద ఏర్పాటు చేశారు. ఇక్కడ నియమించిన గ్రంథపాలకుడు గత ఏడాది మే 31తో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఉదయం, సాయంత్రం గ్రంథాలయానికి రావడం, మహిళలు విద్యార్థులు, ఎంతో విలువైన సమాచారాన్ని పొందటంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేశారు. అయితే ఆ పోస్టును ఆ తర్వాత భర్తీ చేయకుండా అద్దంకి, కొరిశపాడు, గ్రంథపాలకును ఇన్‌చార్జులుగా నియమించి వారానికి ఒక్క రోజు తలుపులు తెరచేలా బాధ్యతలు అప్పగించారు. వారూ ఉద్యోగ విరమణ చేయడంతో, మార్టూరు గ్రంథపాలకునికి ఆ బాధ్యత అప్పగించారు. ఈయనకు మార్టూరుతోపాటు పూనూరు గ్రంథాలయానికి కూడా ఇన్‌చార్జి కావడంతో ఆ రెండు గ్రంథాలయాలను నిర్వహించే సరికే సరిపోతోంది. కాగా నాలుగు దశాబ్దాల పాటు ఇక్కడ గ్రంథపాలకునికి పనిచేసిన ఏ. రమేశ్ బాబు ఉద్యోగ విరమణ చేసిన గ్రంథాలయం, గ్రామంపై మమకారంతో నెలకు ఒక సారి చుట్టం చూపుగా వచ్చి దిన, వారపత్రికలకు సంబంధించి మార్టూరు గ్రంథపాలకునికి సబ్‌మిట్ చేస్తున్నారు. ఎంతో విలువైన పుస్తకాలు తలుపులు తీయనందున పాడయ్యే ప్రమాదం ఉందని పాఠకులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల మంత్రి దృష్టికి స్థానికులు తీసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి గ్రంథపాలకుడిని నియమించి పూర్వ వైభవం తేవాలని విన్నవించుకున్నారు.

ఓడరేవుకు పోటెత్తారు

- సముద్రతీరానికి వేలాదిగా ముస్లింలు


వాడరేవు తీరంలో ముస్లింలు సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


పర్యాటకులకు సూచనలందిస్తున్న రూరల్ ఎస్సై చంద్ర శేఖర్

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసి పోయింది. ముస్లింలకు రెండో అతిపెద్ద పండుగైన బక్రీద్ పండగ అనంతరం ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానాలు ఆచరిస్తుంటారు. దీంతో ఓడరేవుకు పోటెత్తగా తీరం అంతా కోలాహలంగా మారింది. ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతు సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల వాడరేవు తీరానికి పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి, ప్రత్తిపాడు, గుంటూరు ప్రాంతాలకు చెందిన ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, తదితర ప్రాంతాల నుంచి కూడా ముస్లిం సోదరులు అధికంగా వాడరేవుకు చేరుకుని స్నానాలు ఆచరించారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది. సముద్ర తీరానికి అధికంగా ముస్లింలు వస్తుండటంతో రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్, మెరైన్ పోలీసులు, ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. సముద్రంలో లోతుకు ఎవ్వరిని వెళ్లనివ్వకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయించారు. వాచ్ టవర్, ఏఈటీ వాహనం, మైక్ అనౌన్స్‌లు చేపట్టారు. వాడరేవులో ట్రాఫిక్ సమస్య లేకుండా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.